

# నిరీక్షణ

"ఇంతకీ, మనిషి మంచిదేనంటావా?"

అని ప్రశ్నించాడు రామమోహన రావు యిదమిద్ధమని ఎటూ తేల్చుకోలేని స్థితిలో—"మళ్లీ మొదలా? అంతటి నమ్మ కస్తురాలు. నీ పాలిట బడడం నీపూర్వ పుణ్య విశేషమని నీకు ఎన్నిసార్లని చెప్పను?" అని ఎదురు ప్రశ్న వేశాను రామమోహనరావుని, కంఠంలో ఎక్కడ లేని ఆవేశాన్ని నింపుకుంటూ—

"అయితే, నేనే పొరపడ్డానంటావా?" అని అడిగాడు రామమోహన రావు దీనంగా నా కళ్ళల్లోకి చూస్తూ—

"మరికాక? కామిళ్ళకళ్ళకి ప్రపంచమంతా పచ్చగా కనపడుతుందట" అని ఏదోవిధంగా సర్దివేయడానికి ప్రయత్నించాను.

"మరి, ఆ తిరుగుళ్ళకి ఏమీ అర్థం లేదంటావా?" అని అడిగాడు రామ మోహనరావు, అంతటితో ఆ వ్యవహారాన్ని వదులుకోవడం ఏమాత్రం యిష్టంలేక—

"ఆ రామారావుతో తిరిగిన తిరుగుళ్ళేనా?" అని ప్రశ్నించాను, ఏ తిరుగుళ్లో తెలిసి కూడా, ఏమీ తెలియనట్లునటిస్తూ—

"అవున"న్నట్లు తలూపాడు రామ మోహనరావు—

"శకుంతల నిన్ను ఉడికించడానికి ఆ పరుగులు తీసిందని నా అనుమానం" అన్నాను ఏదో ఆలోచిస్తున్న ధోరణిలో-

"నన్ను ఉడికించడానికా?" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు రామమోహనరావు—

భాస్కరభట్ల కృష్ణారావు

"ఈ కాస్త అర్థంచేసుకోలేని మనిషి గొప్ప రసికుడంటే, నేనే మాత్రం నమ్మలేకుండా వున్నాను" అంటూ, రామ మోహనరావు రసికత్వం పైన గట్టిదెబ్బ తీశాను.

"చివరకి నా రసికత్వాన్నే శంకిస్తు న్నావా ?" అని అడిగాడు రామమోహన రావు నా వాక్యానికి బలంగా దెబ్బ తింటో –

"ఒక్క రసికత్వాన్నే కాదు. నీ యింగితజ్ఞానాన్నికూడా శంకిస్తున్నాను" అన్నాను అతనిపైన పూర్తిగా విరుచు కొనిపడుతూ—

"కారణం ?" అని ప్రశ్నించాడు అతను క్లుప్తంగా –

"శకుంతల జీవితాన్ని ప్రేమిస్తుంది. పైగా ఎంతో తెలివికల అమ్మాయి – జీవితం ఎప్పుడు "డల్"గా. "మొనా టనస్"గా తయారవుతుందో ఆమెకి బాగా తెలుసు. ఆ సమయాన్ని కనిపెట్టి, ఒక విరుగుడుమాత్ర వేస్తుంది. దానితో 'మొనాటనీ' విచ్ఛుకుపోతుంది. జీవితం, ఉత్సాహవంతంగా మారుతుంది" అన్నాను ఉపన్యాసధోరణిలో —

"అంటే ఏమిటో నాకు బొత్తిగా అర్థంకాలేదు" అన్నాడు. రామమోహన రావు అమాయికంగా నావేపు చూస్తో–

"అర్థంకాకపోవడానికి, ఇవేమైనా భారత భాగవతాలా ?" అంటూ చులకన చేశాను రామమోహనరావుని –

"ఏవో సూత్రాలలో మాట్లాడుతు న్నావు – అందుకోసమే నీ ధోరణి నాకు అర్థంకావడంలే"దన్నాడు రామమోహన రావు తన ఉద్దేశాన్ని విపులీకరిస్తో –

రామమోహనరావుపైన నాకు జాలి వేసింది. నిజమే – కొందరు మనుషులు హృదయంతో జీవిస్తారు – మరికొందరు మెదడుతో – ఈ రెండింటినీ సమన్వ యించుకోగల శక్తి, ఏ కొద్దిమందికో వుంటుంది. రెండింటినీ సమన్వయించు కోగలిగినప్పుడే. జీవితం సుఖ సంతో షాల్ని ప్రసాదిస్తుంది. రామమోహన రావు హృదయంతో బ్రతుకుతున్నాడు. అందుకోసమే, ఎదుటివారిని ఇట్టే విశ్వ సిస్తాడు. మనిషిని ఏమాత్రం విలువ కట్టలేడు – ఇట్టే మోసపోతాడు. చివ రకి అమితంగా బాధపడుతాడు. ఇదీ అతని తత్త్వం —

"నీకు ఏమీ తోచనప్పుడు ఏం చేస్తావు ?"

"శకుంతల యింటికి వెడుతాను"

"అక్కడ కూడా విసుగుదలగా వుంటే ?"

"ఏ సినిమాకో వెడుతాను"

"ప్రతి రోజూ విసుగుదలగా వుంటే, ప్రతి రోజూ సినిమాకి వెడతావా ?"

"లేదు – ప్రతిరోజూ సినిమాలు

కూడా భరించడం కష్టమే. అందుకోసం ఒకరోజున ఏ స్నేహితుల దగ్గరికో, ఇంకొక రోజున ఏ షికారుకో వెళ్ళి కాలక్షేపం చేస్తాను''

"నీకుమల్లేనే యితరులకి కూడా విసుగుదల పుడుతుందంటావా? లేదంటావా?"


"పుట్టకేఁ? ఆమాట నేనెన్నడూ కాదన లేదే?"

''శకుంతల కూడా నీబోటి మానవ మాత్రురాలే—ఆమెకూ, అప్పుడప్పుడు జీవితంలో విసుగుదల జనిస్తుంది. ఇరువై నాలుగుగంటలూ నీతో గడప జాలని పరిస్థితులు ఏర్పడుతాయి-అప్పుడు ఆమె ఏ సినిమాకో వెడుతుంది-ఏ స్నేహితుల దగ్గరికో పోతుంది. అంత మాత్రాన ఆమె శీలాన్ని శంకించడం నీకు భావ్యమేనా?" నాప్రశ్నా పరంపరల అంతరార్థాన్ని గ్రహించి నట్టున్నాడు రామ మోహనరావు–

"ఇది నువ్వనుకున్నంత తేలికైన విషయంకా"దన్నాడు అతను జవాబుగా.

''ఎందువల్ల?" అని అడిగాను అతన్ని. అసలువిషయం అర్థంచేసుకుందామనే ఉద్దేశంతో—

"సినిమాలకిగాని, షికార్లకిగాని వెళ్ళవద్దని నేనెప్పుడూ శకుంతలని శాసించలేదు. కాని అది ఆ రామారావుతో తిరగడం మాత్రం, నాకు బొత్తిగా



"అక్కడి మీ అత్తయ్య ఫోటో ఏమయిందిరా?"
"అమ్మ కంసాలింటికి తీసుకొని పోయింది. పోగుల డిజైన్ చూపించేందుకు''

యిష్టంలేదు" అన్నాడు రామమోహనరావు కుండ బద్దలకొట్టి నట్లుగా—

ఆ ఉభయులమధ్య, ఏదో గాఢాను బంధం ఏర్పడిందని నాకు తెలుసు. కాగా వ్యవహారం బెడిసిపోతున్నదని కూడా నాకు తెలుసు - కాని చూస్తూ, చూస్తూ రామమోహనరావుతో నిజం ఎల్లా ఒప్పుకోను? నిజం ఒప్పుకుంటే రామమోహనరావు గతేమికాను? శకుంతలపైన విశ్వాసం సడలనంతవరకే అతను మనిషి - సడలిపోతే, మనిషి యింక మనిషికాడు. నిప్పుతొక్కిన కోతిలాగా అయిపోతాడు —

"ఆ సంగతి శకుంతలతో చెప్పలేక పోయావా?" అని అన్నాను. ఏమీ తోచక —

"చెప్పాను - కాని ఏమీ లాభంలేక పోయింది" అని చప్పరించివేశాడు రామమోహనరావు —

"చెబితే ఏమంది?" అని ప్రశ్నించాను ఆతురతకొద్దీ —

"ఏమంటుంది? నవ్వేసి వూరుకుంటుంది" అన్నాడు రామమోహనరావు జవాబుగా —

"ఇప్పుడైనా అర్థమైందా? నువ్వు రసికుడివి కావని నేను ఎందుకన్నానో?" ఆ వాక్యానికి రామమోహనరావు నావేపు ప్రశ్నార్థకంగా చూచాడు —

"నిన్ను బెల్లించి. కవ్వించడానికే ఆ నవ్వేసి వూరుకోవడం - ఇప్పుడైనా తెలుసుకోగలిగావా ఆ శకుంతల ధోరణిని."

"ఇదంతా ఉత్త నటనేనంటావా?"

"మరి కాక?"

"దీనివల్ల ప్రయోజనం?"

"నిన్ను బలంగా తనవేపు ఆకర్షించడమే."

"నే నెప్పుడూ ఆమె కనుసన్నల్లోనే మెలగుతున్నాను — ఇంకా నన్ను ఆకర్షించడం దేనికి?"

"అక్కడే నీవు పొరబడుతున్నావు- నీవు రొటీన్‌గా. ఆమె ఆజ్ఞానువర్తివై వ్యవహరిస్తున్నావు - అంతే - అందులో 'రొమాన్సు' ఎక్కడుంది? నిన్ను బాగా దూరంచేసి. తిరిగి బలంగా తన దగ్గరికి లాక్కోవడంలోనే వుంది వున్న 'రొమాన్సు' అంతా - శకుంతల జీవితాన్ని ప్రేమిస్తుందని చెప్పిందికూడా నేను అందుకోసమే" —

"ఈ మధ్య నన్ను దగ్గరికికూడా చేరనివ్వడంలేదు — మరి దానికేమంటావ్?" అని అడిగాడు రామమోహనరావు సూటిగా నా కళ్ళల్లోకి చూస్తో —

"మనసులోని భావాన్ని చూపులు పట్టిస్తాయి అంటారు. నిజమే. ఈ లోకోక్తిలో ఎంతో సత్యంవుంది — అందుకోసం, అతని చూపుల్లోంచి వెంటనే నా చూపుల్ని తప్పించివేశాను.

"తొందరపడతావు ఎందుకు? త్వరలో జీవనమాధుర్యాన్ని ద్విగుణీకృతోత్సాహంతో ఆస్వాదించబోతున్నావు — అంతే" అని సర్దివేశాను ఆ వ్యవహారాన్ని అంతటితో —

సంతృప్తి సూచకంగా రామమోహనరావు మొహంలో ఒక వెలుగు వెలిగింది —

* * *

ఆ రాత్రి పక్కమీద మేనువాల్చిందే తడవుగా, శకుంతల యిరువై రెండు సంవత్సరాల జీవితం. నా కళ్ళముందు గిర్రున తిరిగింది. ఒకనాడు శకుంతల.

రామమోహనరావు యింట్లోకి, ఒక గడ్డి పరకగా కొట్టుకొని వచ్చింది. ఆనాడు ఆమె స్థానం ఆ యింట్లో గడ్డిపరకకన్నా హీనంగా వుండింది. అవునుమరి, దాసీ పిల్లకి ఏయింట్లో ఏమి గౌరవముంటుందని? శకుంతల మంచి అందమైన పిల్ల. ఏదో తోడుగా వుంటుందని రామమోహనరావు కూతురు రమణతోపాటు, శకుంతలనికూడా బడిలో చేర్పించారు. రమణకన్నా శకుంతల రెండేళ్ళు పెద్ద. ఇద్దరూ ఒకటే క్లాసులో చదువుకునేవాళ్ళు — రమణ ఏకైక పుత్రిక కనుక రామమోహనరావు కూతురు చదువు విషయంలో, అప్పట్లో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నాడు. పైగా అతను జాగీర్దార్. ఏనాడూ ఆ కుటుంబానికి ధనం విషయంలో ఏ లోటు కలగలేదు. రమణ చదువుకోసం, నగరంలో ఒక సంసారం పెట్టాడు. శకుంతలకూడా రమణతో పాటు నగరానికి వచ్చింది. నగరంలో రమణతోకలిసి చదువుకుంది. రమణకి పధ్నాలుగుసంవత్సరాలు వచ్చేసరికి ఆమె పెళ్ళి నిశ్చయమైంది. అప్పట్లో రమణ ఫిఫ్తుఫారం చదువుతున్నది. చదువు మానిపించి రామమోహనరావు రమణకి పెళ్ళిచేశాడు. పెళ్ళైన ఆరునెల్లకి రామమోహనరావు భార్య చనిపోయింది. ఇంకొక ఆరునెల్లల్లో రమణ, అత్తవారింటికి కాపురానికి వెళ్ళిపోయింది.



"నీవు రేసులో లక్కీ-స్టార్‌ను ఫాలో అవుతుంటివే అది ఏమయింది?"
"అది మిగతా వాటిని ఫాలో అయింది."

ఎందుకో రమణతోపాటు, శకుంతల చదువుకూడా మానిపించలేదు రామమోహనరావు. రమణ అత్తవారింటికి వెళ్ళేనాటికి శకుంతల స్కూలు ఫైనల్ పూర్తిచేసింది. రామమోహనరావు తల్లిదండ్రులు ఏ చిన్నతనంలోనో చనిపోయినారు. రమణ అత్తవారింటికి వెళ్ళడంతో, అతను ఒంటరివాడైనాడు. ఈమధ్య జాగీర్ పోయింది. ఊళ్ళో వ్యవసాయం తప్ప అతనికి యితర వ్యాపకం ఏమీ మిగలలేదు. కొత్త వ్యాపకం ఏదైనా కల్పించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఊరువదిలి, నగరంలో శాశ్వతంగా కాపురం పెట్టాడు. పాతయిండ్లు కొని, మరమ్మత్ చేయించి, వాటిని బాడుగలకివ్వడమో, లేక అమ్మి

వేయడమో, రెండింటిలో ఏదో ఒకటి చేయడం మొదలెట్టాడు. ఇండ్లు బాగు చేయించడానికి, సిమెంటూ, సున్నం అవసరమైనాయి. కాగా నగరంలో కొత్తయిండ్లు కట్టడం విరివిగా ప్రారంభమైంది. రామమోహనరావు వెంటనే ఒక సిమెంటు దుకాణం పెట్టాడు. అంతటితో ఆగక, అతను ఒక కంట్రాక్టర్‌తో కలిసి, కొత్త యిండ్లు కట్టించడానికి పూనుకున్నాడు. దానితో బోలెడు ఆదాయం పెరిగింది. ఎంత ఆదాయం పెరిగినా, ఎన్ని వ్యాపకాలు కల్పించుకున్నా, రామమోహనరావుని ఒంటరితనంమాత్రం వీడలేదు. ఈ మధ్య శకుంతల కాలేజీలో చేరింది. ఇంటర్ పూర్తిచేసింది. ఏదో కాస్త తెలుగు, ఉర్దూ తప్ప రామమోహనరావు అట్టే చదువుకోలేదు అయినా శకుంతలని చదువు విషయంలో ప్రోత్సహిస్తూనే వచ్చాడు. చదువువల్ల శకుంతలకి యింట్లో ఒక స్థానం వచ్చింది. కుటుంబంలోని ఒక వ్యక్తిగా మెలగడం మొదలెట్టింది. చివరకి రామమోహనరావు తన ఒంటరి తనాన్ని భరించలేకపోయాడు. ఏపుగా పెరిగిన పంధొమ్మిది సంవత్సరాల అమ్మాయి, అతనికి యింట్లో కంటబడింది. అతను శకుంతలని దగ్గరికి తీశాడు. శకుంతల కృతజ్ఞతకొద్దీ అతనికి లొంగింది. అప్పుడు ఆమెకి, ఉభయుల వయస్సులోగల తారతమ్యం జ్ఞప్తికి రాలేదు. కాగా తన లొంగుబాటుని ఒక పెన్నిధిగా భావించింది ఆమె అప్పట్లో — ఉభయుల జీవితాలు. రెండు సంవత్సరాలపాటు, సుఖప్రదంగా గడిచాయి. గడ్డిపరకగా ఆ యింట్లోకి కొట్టుకువచ్చిన శకుంతల మహావృక్షమై విలసిల్లింది. రామమోహనరావు జీవితంపైన శీతలఛాయల్ని వెదజల్లింది. ఆ రెండు సంవత్సరాలలో శకుంతల బి. ఏ. పూర్తి చేసింది. మహిళాకళాశాలకి స్వస్తిచెప్పి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్సు కాలేజీలో ఎం. ఏ. కోసం చేరింది. అక్కడ రామారావుతో శకుంతలకి స్నేహం కుదిరింది. మహిళాశాలనించి, ఒక్కసారే బహిఃప్రపంచంలో పడడంతోనే ఆమె కళ్ళు జిగేలుమన్నాయి. మగపిల్లలతో కలిసి చదువుకోవడం, అదే మొదటిసారి శకుంతలకి - ఎం.ఏలో చేరిన రెండుమాసాలకి, ఆమెకూ, రామమోహనరావుకూ వయస్సులోగల వ్యత్యాసం శకుంతలకి చప్పున గుర్తుకు వచ్చింది. కాగా అతను చదువుకున్నవాడు కాడని, అప్పట్లో మొదటిసారి ఆమెకు తోచింది. క్లాసులో ధనవంతుడూ, అందమైనవాడూ అయిన రామారావు కనపడ్డాడు ఆమెకి. — శకుంతల అతనితో స్నేహం కలిపింది. తను అవి

వాహితనని చెప్పుతుంది అతనితో — తనకూ, రామమోహనరావుకీగల సంబంధాన్ని, అతనిదగ్గర దాచేసింది. స్నేహం ప్రణయంక్రిందికి మారింది. దానితో రామారావు శకుంతలలు వివాహం చేసుకోవడానికి నిశ్చయించుకున్నారు. కాని ఈ వివరా లేవీ, రామమోహనరావుకి తెలియవు. శకుంతల, రామారావుతో అల్లరిచిల్లరగా తిరుగుతున్నదని, ఆ మానవుడు అనుమానపడ్డాడేకాని తెర వెనకాల ఇంత తతంగం జరుగుతున్నదనీ, దానికి ఫలితంగా తనకొంపే కూలిపోతుందనీ అతను ఎన్నడూ కలలోకూడా అనుకోలేదు.

జరిగిందీ, జరుగతున్నదీ, ఇంక ముందు జరిగే చరిత్ర కూడా నాకు తెలుసు. తను తప్పక రామారావుని వివాహం చేసుకుంటానని, శకుంతల ఎన్నడో నాతో చెప్పింది. "నీకు ఈషణ్మాత్రమైనా కృతజ్ఞత లేదా? అని నేను ఆమెని సూటిగా ప్రశ్నించాను. "నేనూ, మీకు మల్లేనే చదువుకున్నదాన్ని, మీకుమల్లేనే నాకూ కృతజ్ఞత అంటే ఏమిటో బాగా తెలుసు. నేను రామమోహనరావుగారికి జీవితాంతంవరకూ కృతజ్ఞురాలినై వుండే మాట నిజం - కాని అంతమాత్రాన నా భవిష్యత్తుని నేను చేతులారా పాడుచేసుకోలేను" అని అరమరికలేకుండా సమాధానం చెప్పింది. "నీవు పెళ్ళిచేసుకుంటే




"జాగర్తరోయ్! శిష్యా విగ్గు భగ్గుమంటే డేంజరు!"


రామమోహనరావు గతేమికాను?" అని కూడా అడిగిచూచాను. "ఏమవుతుంది? ఏమీకా"దని సమాధానం చెప్పింది. "అయితే అతన్ని దిక్కులేనివాడిగా చేసిపోతావా?" అని చివరమాటగా అడిగాను. "ఎందుకు చేస్తాను - జీవితాంతం వరకూ రమణతోపాటూ నేనూ అతనికి ఒకకంట కనిపెట్టుకొని వుంటాను" అని సమాధానం చెప్పింది శకుంతల - "అతనికోసం నీవు నీ భవిష్యత్తుని త్యాగం చెయ్యలేవా?" అనికూడా అడిగాను - "నేను యిరవైయవ శతాబ్దపు యువతిని - వ్యక్తిత్వాన్ని చంపుకొని త్యాగానికి పూనుకోలేను - పోనీ నన్ను పెళ్ళిచేసుకొమ్మనండి రామమోహనరావుగారిని - అప్పుడు రామారావు

గారితో నా సంబంధం తెగతెంపులు చేసుకుంటాను" అని సూటిగా సమాధానం చెప్పింది శకుంతల - దానితో నేను తాత్కాలికంగా నిరుత్తరుణ్ణైనాను. కొంత సేపటికి తేరుకొని. "రామమోహనరావు పూర్తిగా హృదయంతో బ్రతుకుతాడు - మెదడుతో జీవితంలో అంతగా పని తీసుకోడు. అందువల్ల నువ్వు వెళ్ళిపోవడమే జరుగుతే, అతని హృదయం అమాంతంగా పగిలిపోతుంది. ఆ విషయం నీవు ఎప్పుడైనా ఆలోచించావా ?" అని అడిగాను శకుంతలని ఆతురతకొద్దీ— "రామమోహనరావుగారి హృదయం కడు సున్నితమైందని, మీకన్నా నాకే ఎక్కువగా తెలుసు. అందుకోసమే. వారిపట్ల నేను చేస్తున్న ద్రోహాన్ని అప్పుడప్పుడు కొద్దికొద్దిగా వారి కళ్ళల్లో పడేస్తున్నాను'' అంది శకుంతల సాలోచనగా - "ఒక్కమాటే జీవితంలో షాకుయివ్వడానికి బదులు, అతనికి నెమ్మదిగా విషం అలవాటు చేస్తున్నావన్నమాట" అని అన్నాను. వీలగా — ''చేసినతప్పు, చెబితే తీరుతుందంటారు - అందుకోసం అన్ని విషయాలూ మీముందు పెడుతున్నాను"అని శకుంతల నా నేరారోపణని లక్ష్యం చెయ్యకుండా సమాధానం చెప్పింది. ''ఉభయుల కండ్లముందు తెరలుదించి, ఒక నాటకమాడేస్తున్నావు అంతేనా ?

అన్నాను. రామమోహనరావుకి ద్రోహం చేస్తున్నదనే అక్కసుకొద్దీ — "ఉభయుల కండ్లముందు కాదు — ఒక్క రామారావుగారి కళ్ళముందు మాత్రం నల్లటి తెరలుదించి, నా గతాన్ని మరుగు పరుస్తున్నాను. కాని రామమోహనరావుగారి కళ్ళముందు నించి తెరలు తొలగించి నా నిజస్వరూపాన్ని వారికి చూపుతున్నాను అంది శకుంతల నా వాక్యాన్ని సవరిస్తో — "ఎవరైనా నీ గతచరిత్రని రామారావుముందు ఉంచితే ?'' అని భయపెట్టి చూచాను శకుంతలని — "ఆ భాగ్యం యితరులకి దక్కనివ్వను- వివాహానికి పూర్వం నేనే వారికి నా చరిత్రని విన్నవించుకుంటాను — వారు క్షమించి వివాహానికి యిష్టపడితే, వారిని పెళ్ళిచేసుకుంటాను - లేకపోతే లేదు" అంది శకుంతల నా బెదిరింపులని లెక్కచెయ్యకుండా — "ఇష్టపడకపోతే ఏమి చేస్తావు ?" అని అడిగాను. అంతటితో ఆ వ్యవహారాన్ని వదిలివేయడం యిష్టం లేక — "ఇష్టపడకపోతే. నా ప్రస్తుత జీవితంలో మార్పేమీ వుండదు — అంతే" అని ఉభయ జీవన పద్ధతులకీ తను సమంగా సంసిద్ధపడి వున్నట్లు, శకుంతల తేలికగా జవాబుచెప్పింది — ఇంక నాకు మాట పెగల్లేదు. నోటికి గట్టి తాళం పడింది.

శకుంతల జీవితం అప్పుడప్పుడూ

ఆమెతో నేను జరుపుతూ వచ్చిన సంభాషణా, టాకీరీళ్ళకి మల్లే నా కళ్ళముందు తిరిగాయి. సంభాషణని తిరిగి నా మెదడు నెమరు వేసింది. నేనేమో ఎప్పటికప్పుడు రామమోహనరావుని మభ్యపెడుతూ కాలం గడుపుతున్నాను. శకుంతల ప్రేమ కలాపాలు ఒట్టి నటన అని కొట్టిపారవేస్తున్నాను. "నిన్ను ప్రగాఢంగా ప్రేమించడం వల్లనే నిన్ను ఉడికించడానికి శకుంతల ఆ విధంగా నటిస్తున్న"దని రామమోహనరావుతో బొంకులు బొంకుతూవచ్చాను. కాని ఈ బొంకులతో ఎన్ని రోజులని గడుస్తాయి - ఒకనాడు కాక పోయినా, ఇంకొక నాడైనా నిజం బయట పడక మానదు. అప్పుడు రామమోహనరావు గతేమికాను ? నేను ఒక వేపు అతన్ని మభ్యపెట్టి, ఉపశమన వాక్యాలు పలుకుతున్న కొద్దీ ఇంకొక వైపు శకుంతల అతని అనుమానానికి ఆజ్యం పోసి పొగలు రేకెత్తిస్తున్నది. రాజి, రాజి ఏనాడైన ఆ పొగలు భగ్గున మండకమానవు — రెండు బలీయమైన శక్తుల మధ్యపడి రామమోహనరావు నలిగిపోతున్నాడు. చూస్తూ, చూస్తూ నేను నా బాల్యమిత్రునికి, పరిణామం దృష్ట్యానిజం చెప్పలేక పోతున్నాను, శకుంతల అతని కళ్ళముందునుంచి నిజాన్ని దాచలేక పోతున్నది. నేను అతని కోసం, ఒక ఊహాప్రపంచాన్ని



"స్వామీ! మీ నామమేమి?"
"ఛ! నీపనేదో నువ్వు చూసుకోక నా నామముతో నీకేం పనయ్యా! అది ఎట్లుంటే నీకెందుకు?"

కల్పిస్తున్నాను. శకుంతల ఆ ప్రపంచాన్ని క్రమపద్ధతిగా కూలదోస్తున్నది. ఇందులో ఎవరుదోషులో నాకు అప్పటికీ ఇప్పటికీ అర్థం కాలేదు — నిజం విచారిస్తే ఎవరూ కారేమోనని తోస్తుంది. శకుంతల తన భవిష్యత్తును సరిదిద్దుకోవడానికి తాపత్రయ పడుతున్నది. సంఘంలో తనకి ఒక సముచిత స్థానాన్ని కోరుతున్నది — తన ఆశయ సిద్ధికోసం ఆమె గతాన్ని బలిపెట్టదలచింది. ఇరువైరెండు సంవత్సరాల అమ్మాయికి తన భవిష్యత్తు పైన దృష్టివుండడం సహజమే— అందులో దోషం ఏమీలేదు. హేళనప్రదమైన జీవితాన్ని వీడి, స్వచ్ఛంద

జీవితాన్ని చేపట్టదలంచింది — ఇది నిజంగా హర్షింపదగ్గ విషయం — గర్హింపవలసింది ఏ మాత్రం కాదు — రామమోహనరావుకి, గతం, విస్మృతి గహ్వరంలో తలదాచుకుంది. భవిష్యత్తు లేదు. వర్తమానం ఒక్కటే మిగిలింది. దాన్ని పట్టుకొనే. అతను జీవితాంతం పాకులాడదలచాడు — వర్తమానానికి, ఎక్కడ దెబ్బతగులుతుందో నని అతను కంపరమెత్తి పోతున్నాడు — ఇట్టి పరిస్థితుల్లో నా కర్తవ్యమేమిటని ఆలోచించాను. బాల్యమిత్రుడిని కాపాడుకోవడమే నని వెంటనే తోచింది. కాని ఆ కాపాడుకోవడం ఎల్లాగో ఏమీ పాలుపోలేదు. వెంటనే వెళ్ళి రామారావుకి, శకుంతల గతచరిత్ర అంతా చెప్పివేస్తే? బాగానే వుంటుంది. శకుంతలఆట కట్టుబడుతుంది. కాని "నలభై అయిదు సంవత్సరాల నడీడు మనిషి కోసం, ఒక యిరువైరెండు సంవత్సరాల అమ్మాయి జీవితాన్ని బలిపెట్టడం భావ్యమేనా ?" అనే సందేహం కలిగింది. ఏ మాత్రం భావ్యం కాదని నా మెదడు మరీ మరీ చెప్పింది. కాగా గతంకోసం భవిష్యత్తుని బలిపెట్టడం న్యాయంకాదని నాకు కూడా తోచింది. తన గత చరిత్ర చెప్పి, అప్పటికీ రామారావు యిష్టపడితేనే, అతన్ని వివాహం చేసుకుంటానని వాగ్దానం చేసింది శకుంతల—ఇంక ఎల్లాగూ తన గతాన్ని గూర్చి చెబుతుంది శకుంతల, రామారావుకి—ఇట్టి పరిస్థితుల్లో నేను తొందరపడి మాత్రం ఏమి ప్రయోజనం. తగుదునమ్మా అని నేను తీరావెళ్లి చెబితే అతను, శకుంతల చరిత్రని అంగీకరించివేస్తే ? అతను అంగీరించినా, అంగీకరించవచ్చు-ఈ నాటి యువకుల మనస్తత్వమే, ఎందుకో తనకు విచిత్రంగావుంటుంది. పోనీ రామమోహనరావుకి నిజం చెప్పి వేస్తే ? అతను నిజాన్ని భరించ గలడనే నమ్మకం నాకు ఏ కోశానా లేదు-శకుంతల పైన విశ్వాసం సడలడంతోనే, అతను గుండె పగిలి చనిపోతాడు - ఎందుకో ఈ సమస్యాపరిష్కారం నాకు మించిన పనిగా తోచింది — పోనీ పరిష్కారం కాలాని వదిలి వేస్తే ? నిజమే కాలమే యిటువంటిగడ్డుసమస్యల్ని పరిష్కరిస్తుంది— అందులో ముఖ్యంగా మానవమాత్రులకి సాధ్యంకాని సమస్యల్ని—ఎందుకో ఈ ఆలోచన తట్టడంతోనే, నా మనస్సు కాస్తతేలిక పడింది. నెత్తి మీదినించి ఏదోపెద్ద బరువు దించినట్లయింది. ఇంక ఎన్నడూ, రామమోహనరావుని గురించిగానీ, శకుంతలని గూర్చిగాని ఆలోచించ గూడదని నిశ్చయించుకున్నాను. కొంతకాలంపాటు వాళ్ళ యింటికి వెళ్ళకుండా వుండడమే శ్రేయస్కరమని కూడా భావించాను. అప్పట్లో మొదటి

సారిగా — ఆ సమస్యని అనంతమైన కాలానికి వదిలివేసి, గట్టిగా కళ్ళుమూసుకున్నాను - ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో తెలియదు.

*  *  *

ఈ మధ్య కాలచక్రం, ఇంకొకనాల్గు మాసాల్ని చుట్టివేసింది—ఈ నాలుగు నెలల్లో నేనెన్నడూ. రామమోహనరావు యింటివేపు వెళ్ళలేదు - అతనూ, పనిగట్టుకొని నా దగ్గరికి రాలేదు—ఒకనాడు రామమోహనరావు తుఫానుకుమల్లే మా యింటికి వచ్చాడు—వచ్చీరావడంతోనే, గాభరాగా "శకుంతల రామారావుతో లేచి పోయిం"దని చెప్పాడు—.

నేను ఉలకాలేదూ, పలకాలేదు— అనుకున్నంత పని జరిగిందని, మనస్సులో ఒకమాటు మాత్రం అనుకున్నాను.

"ఏమి చేతామో చెప్పవేఁ ? అల్లాబెల్లం కొట్టిన రాయికిమల్లే కూర్చుంటావేఁ ? అని తొందర పెట్టాడు నన్ను రామమోహనరావు—

ఉద్రేకంతో రామమోహనరావు మొహం కందగడ్డకుమల్లే ఎర్రబారింది, మనిషి ఆపాదమస్తకం కంపించి పోతున్నాడు—శరీరమంతా ముచ్చెమటలు పోస్తున్నాయి — నిదానించి చూస్తే. ఆ క్షణంలో రామమోహనరావుకి. ఎంతో ముసలి తనంవచ్చినట్లు నాకు తోచింది.

"శకుంతల రామారావుతో లేచి పోయినట్లు నీకు ఎల్లా తెలిసింది ?" అని అడిగాను అతన్ని ఏమీ తోచక—

శకుంతల వ్రాసిన ఉత్తరం తత్తరపాటుతో జేబులోంచి తీసి, అతను నా పైకి గిరాటు వేశాడు—

నేను ఉత్తరం చదువుకున్నాను.—

"ఆ ఏడ్చుకునేదేదో ఇక్కడే ఏడ్చుకోలేక పోయిందా ? ఈ పాటి ఘనకార్యానికి వాడితో ఎక్కడికో లేచి పోవడంకూడా దేనికి ?" అని రామమోహనరావువినీ వినపడకుండా నోట్లో నోట్లో గొణిక్కుంటున్నాడు.

అతని దైన్యాన్ని చూచి నాకు జాలి వేసింది.

ఈ సంకటావస్థలోంచి ఎల్లా బయటపడడమా అని క్షణం ఆలోచించాను. చప్పున ఒక చక్కని ఆలోచన తట్టింది.

"భడవాముండ ! మనల్ని తప్పించుకొని ఎక్కడికి వెడుతుంది ? వెంటనే పోలీసు రిపోర్టు యిస్తాను" అని గట్టిగా అరుస్తూ. లేనిపోని తొందరపాటుని నటిస్తో. చప్పున కుర్చీలోంచి లేచాను. రామమోహనరావు కళ్ళు, ఎంతో ఆశతో వెలిగాయి —

శకుంతల మళ్ళీ మనకు దొరుకుతుందంటావా ?" అని అడిగాడు రామమోహనరావు ఎంతో ఆతురతగా —

"దొరక కేమిచేస్తుంది ? మూడు

పూటల్లో పట్టించి తెప్పించనూ ?" అని అరిచాను ఎక్కడలేని కోపాన్ని నటిస్తో-

"ఇందులో శకుంతల తప్పు ఏ మాత్రం లేదని నా అనుమానం - ఉన్న తప్పంతా నిస్సందేహంగా ఆ రామా రావుదే" అన్నాడు రామమోహనరావు కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటో —

ఆ వాక్యానికి నా గుండె తరుక్కుపోయింది —

అతని అచంచల విశ్వాసానికి మనస్సులో వెయ్యిదేవుళ్ళకి మొక్కుకున్నాను-

"ఆ విషయంలో ఇంకా నీకు సందేహమెందుకు ?" అని ఉద్దేశపూర్వకంగా అతని అభిప్రాయాన్ని బలపరిచాను —

ప్యాంటువేసుకొని, బుష్ కోటు తొడుక్కుంటూ, "ఒక విషయం చెప్పనా?" అని అడిగాను రామమోహన రావుని -

"ఏమి"టన్నట్లు నావేపు ఆతురతగా చూచాడు అతను —

"యౌవనోద్రేకంలో ఏదో పొరపాటు చేసినా, శకుంతల తప్పక తిరిగి వస్తుం"దన్నాను నేను, కంఠంలో, ప్రపంచంలో ఎక్కడలేని విశ్వాసాన్ని బలవంతంగా నింపుకుంటో —

"నిజమేనా ?" అని అడిగాడు రామమోహనరావు డగ్గుత్తికతో—ఆనందంలో అతని కంఠం బిగుసుకు పోయింది —

అతని కళ్ళల్లో లక్షక్యాండిల్ పవర్ కాంతి వెలిగింది —

"నిజం, నిజం, ముమ్మాటికీ నిజం" అని నేను ఉత్తరక్షణంలో అన్నాను — నా కంఠం నాకే బోలుగా వినపడింది — రామమోహనరావుని యింటికి పంపించి వేసి, మూల మలుపువరకు వెళ్ళి మా యింటికి తిరిగి వచ్చేశాను —

శకుంతల విషయమై పోలీసు రిపోర్టు యివ్వలేదు —

శకుంతల ఆనాటికీ, ఈనాటికీ, తిరిగి రాలేదు.

రామమోహనరావు, అన్ని వ్యాపకాలూ వదులుకొని, ప్రతిరోజూ ఆమె రాకకోసం నిరీక్షిస్తున్నాడు —

నేను వెళ్ళినప్పుడల్లా శకుంతల తప్పక తిరిగివస్తుందని'' రామమోహన రావుకి ధైర్యం చెబుతున్నాను —

అతను నా మాట ఎప్పటికప్పుడూ విశ్వసిస్తూనే ఉన్నాడు. శకుంతల ఉత్తరాలు వ్రాసి, నా ద్వారా అతని క్షేమ సమాచారం తెలుసుకుంటున్నది —

రామమోహనరావు, ఇంకా శకుంతల రాకకోసం నిరీక్షిస్తూనే ఉన్నాడు —

కాలచక్రం, దినాల్నీ, మాసాల్నీ, సంవత్సరాల్నీ యథాపూర్వం చుట్టి వేస్తూనే వుంది. ★